

# ఇంటర్వ్యూ

"అలా కూర్చో!" అన్నాడాయన కుర్చీ చూపుతూ.

ఆ స్వరంలో ధ్వనించినది ఆజ్ఞో, విజ్ఞాపనో అర్థంగాలేదు అప్పారావుకు.

కూర్చున్నాడు అప్పారావు మార్పులుకకుండా.

అప్పారావును తేరిపార జూచాడాయన.

తలొంచుకున్నాడు అప్పారావు ఆ చూపుల్ని తట్టుకోలేక.

చిరునవ్వు చిందించేడాయన.

సిగ్గుపడ్డాడు అప్పారావు.

ఆ సిగ్గుపడటం అత్తవారింట్లో అడుగెట్టబోతున్న కొత్త పెళ్ళికూతురును గుర్తుకు తెచ్చిందా యనకు.

"నీ పేరు? " ప్రశ్నించేడాయన.

సందేహించేడు అప్పారావు.

క్షణమాగి "ఊ! నీ పేరు? " రెట్టించాడాయన.

తడబడ్డాడు అప్పారావు.

"అప్లికేషన్‌లోనే వ్రాశాను గదండీ!" అన్నాడు నోరు పెగల్చుకుని.

జేబురుమాలు నోటికడ్డం పెట్టుకున్నాడాయన.

"ఏమని వ్రాశావు? "

"నా పేరు అప్పారావు అనే వ్రాశానండీ!"

ఆ క్షణంలో అప్పారావు కంఠంలో ధ్వనించిన నిజాయితీ ఆయన్నంతగా ఆకర్షించలేదు

"అలాగా! నీవెప్పుడూ అబద్ధాలు వ్రాయవా ఏమిటి? " ప్రశ్నించాడాయన వింతగా అప్పారావు కళ్ళలోకి చూస్తూ.

"అవునండీ! వ్రాయకపోవడమేగాదు. అబద్ధాలాడనుకూడాను? " అన్నాడు అప్పారావు ఉత్సాహంగా.

"అనటానికీ, వ్రాయటానికీ తేడా ఉందా? " అన్నాడాయన సాగదీస్తూ.

"లేకేమండీ! చేత్తో రాస్తారు, నోటితో ఆడతారు" జవాబిచ్చాడు అప్పారావు.

"అదేమిటి? కాళ్ళతోనూ, చేతుల్తోనూ ఆడటం చూశానేగాని, నోటితో ఆడటం గురించి విననన్నా లేదే!" అన్నాడాయన ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ.

"కాదండీ! కాళ్ళతోనూ, చేతుల్తోనూ ఆటలాడుతారు; నోటితో మాటలాడుతారు" వివరించాడు అప్పారావు.

'అలాగా' అన్నాడాయన.

ఆ క్షణంలో అప్పారావు కళ్ళలో పరీక్షల్లో చిక్కులెక్కను సునాయాసంగా చేసేసిన విద్యార్థిలో రేగే ఉత్సాహం లాంటిది కొట్టవచ్చినట్లు స్పష్టంగా పొడగట్టిందాయనకు.

"బుద్ధిమంతుడవే!" అన్నాడాయన.

ఏ అర్థంలో ఆయనా మాటన్ననదీ తెలీలేదు అప్పారావుకు.

"అందరూ అలాగే అంటారండీ!" అన్నాడు అప్పారావు క్షణమాగి.

"ఏమని? " కళ్ళు చిట్లించేడాయన.

"ఇందాక మీరన్నట్లేనండీ! కాని..."

"ఊఁ ... కానీ!"

"కానీ, మా మామయ్య మాత్రం తిడుతుంటాడండీ అస్తమానూ!"

"అలాగా! ఎందుకు? "

"నాకు అబద్ధాలాడటం చేతగాదట. బ్రతకటం అసలే చేతగాదట - అందుకని."

"నీకు బ్రతకటం ఎందుకు చేతకాదు? "

"నిక్షేపంలాంటి ఉద్యోగం చేజేతులా పోగొట్టుకున్నావు, ఇంకెలా బ్రతుకుతావు" అంటాడండీ మా మామయ్య"

"అయితే నువ్వింతకు ముందేమన్నా ఉద్యోగం చేశావా? " అన్నాడాయన ఆశ్చర్యపోతూ.

"అవునండీ చేశాను" అన్నాడు సగర్వంగా అప్పారావు.

"మరెందుకు పోయిందా ఉద్యోగం? " అనుమానంగా చూశాడాయన అప్పారావు కళ్ళలోకి.

గొంతు సవరించుకుంటూ క్షణమాగేడు అప్పారావు. "మేనేజరు పొమ్మన్నాడండీ!"

"ఎవరా మేనేజరు? "

"అరగంటకో పాన్ పరపరా నములుతుంటాడే, ఆయనేనండీ!"

అప్పారావు కళ్ళలో రోషం పల్చగా తొంగిచూసింది.

"అలాగా! ఆయనెవరికి మేనేజరు? " ప్రశ్నించి జేబురుమాలు మళ్ళీ నోటికడ్డం పెట్టుకున్నాడాయన.

"నేనింతకు ముందు ఉద్యోగం చేసిన కంపెనీ మేనేజరండీ"

"మరి ఆయనెందుకు పొమ్మన్నాడు? "

"నేనెందుకూ పనికిరానట, అందుకని."

"ఏం, నీకే పనీ చేతగాదా? "

"చేతగాకేమండీ! అసలు నాకు చేతగాని పనే లేదంటాడు మా మామయ్య."

"మరి...?"

"మరే, వాళ్ళు లెక్కల్లో అబద్ధాలు వ్రాయాలన్నారు?"

"అయితే?"

"నేను వ్రాయలేనన్నాను."

"అప్పుడు...?"

"నువ్వు మాకక్కర్లేదు పొమ్మన్నారు."

"మరి నీవు అబద్ధాలాడవా?"

ఉలిక్కిపడ్డాడు అప్పారావు.

"అబద్ధాలా! ఆడటమేగాదు, వ్రాయనుకూడానండీ." అన్నాడు ధీమాగా.

ఆ క్షణంలో మెరుస్తున్న అప్పారావు కళ్ళలోని వింత కాంతిని గమనించలేదాయన.

"అయితే నువ్వింక దయచెయ్యవచ్చు" అన్నాడాయన జేబురుమాలు నోటికడ్డంతీసి.

"ఎక్కడికండీ?" అడిగేడు అప్పారావు.

"మీ యింటికి" తీక్షణంగా జవాబిచ్చేడాయన.

బిత్తరపోయ్యేడు అప్పారావు "మీ ఆఫీసులో ఓ ఉద్యోగం ఖాళీగా ఉందని ప్రకటిస్తేనే గదాండి నేనిలా వచ్చింది" అన్నాడు తడబడుతూ.

"మా కంపెనీ దివాలా తియ్యాలని నీ ఉద్దేశ్యమా?" ప్రశ్నించాడాయన.

"ఎబ్బెబ్బే!" నసిగాడు అప్పారావు.

"అబ్బాయ్, మేం వ్యాపారం చేసుకొనే వాళ్ళం. మాకు నీ బోటి సత్య హరిశ్చంద్రులుగాదు కావలసింది" నెమ్మదిగా వివరించాడాయన.

"అవునండీ. ఆ సంగతి మా మామయ్య కూడా చెప్పాడండీ" వంత పలికాడు అప్పారావు.

"ఏం సంగతీ?"

"మీరు చెప్పినట్లు వినాలనీ, ఉద్యోగం జాగ్రత్తగా చూసుకోవాలనీ చెప్పేడండీ మా మామయ్య!"

"మరి అబద్ధాలాడ నంటుంటివిగా!" విసుక్కున్నాడాయన.

విసుక్కుంటూనే స్వింగ్ డోర్స్ క్రిందుగా వరండాలో కనిపిస్తున్న పదమూడు పాంట్లనూ, మరన్ని జతల బూట్లనూ పరికించి నొసలు చిట్లించేడు.

"ఇకమీదట అదేం లేదండీ! మీరు చెప్పినట్లు చేస్తానని మామయ్యకు హామీ ఇచ్చే వచ్చాను గదండీ" అన్నాడు అప్పారావు.

"సరే, నువ్వేం ప్యాసయ్యావు?"

"మెట్రిక్ చదివానండీ!" జవాబిచ్చాడు అప్పారావు.

"పాసయ్యావా?"

'ప్యాసవుతానండీ. మళ్ళీ మొన్న సెప్టెంబరుకు వెళ్ళాను గదాండీ! ఈసారి తప్పక ప్యాస వుతానంటున్నాడండీ మా మామయ్య."

ఈసారి మరింత గట్టిగా విసుక్కుంటూ అప్పారావు కళ్ళలోకి చూశాడాయన.

చూసి కొంచెం శాంతించాడు. "దయచెయ్యి" అన్నాడాయన క్షణమాగి.

"ఎక్కడికండీ? " అడిగాడు అప్పారావు

వేలెత్తి చూపించాడాయన.

అటు చూసిన అప్పారావుకు స్వింగ్ డోర్స్ క్రిందుగా వరండా, ఆ వరండాలోని పదమూడు పాంట్లూ, మరిన్ని జతల బూట్లూ రకరకాలవి అగుపించాయి.

"ఎందుకండీ!" ప్రశ్నించేడు అప్పారావు

"ఎందుకంటే, అక్కడ పదముగ్గురు గ్రాడ్యుయేట్లు ఇంటర్వ్యూకు ఎదురుచూస్తూ కూర్చు న్నారు గనుక!" జవాబిచ్చాడాయన శాంతంగా.

ఆయన మాటల్లోని ఆంతర్యం- అంతుచిక్కలేదు అప్పారావుకు.

"ఆర్డరు ఇప్పించండి వెళ్తాను" అన్నాడు అప్పారావు.

"ఏం ఆర్డరు? ".

"ఉద్యోగపు ఆర్డరండీ! అది లేకుండా వెళ్తే తిడతాడండీ మా మామయ్య!" జవాబిచ్చాడు అప్పారావు.

"అయితే గంగలో దూకండి!" మండిపడ్డాడాయన.

"ఎవరండీ!" అయోమయంగా చూశాడు అప్పారావు.

"నువ్వూ, మీ మామయ్యాను!" గద్దించేడాయన లేస్తూ.

"అవునండీ! మా మామయ్య కూడా అలాగే అన్నాడండీ!" వంత పలికేడు అప్పారావు.

తెల్లబోయాడాయన.

"ఏమని? " ప్రశ్నించేడాయన.

"ఇందాక మీరన్నట్లేనండీ!"

"అంటే? "

"ఇందాక నేను వచ్చేముందు మా మామయ్య అలాగే అన్నాడండీ!"

"ఎలాగని...? "

"నీకెందుకు నువ్వు ఇంటర్వ్యూకి వెళ్ళరా అబ్బాయ్! నేను చెప్పానుగా. నా మాట అంత తేలిగ్గా తీసెయ్యడులే. అంతపనీ జరిగితే ఆ వెధవని గంగలో ముంచుతాను" అన్నాడండీ.

"ఎవడా మామయ్య? " ఆగ్రహంతో, నిలువెల్ల వణికిపోతూ గర్జించాడాయన.

"అలాగంటారేమండీ? మీరు బాగా ఎరుగుదురట గదండీ."

"నేనా? "

"అవునండీ. నిన్న ఉదయం మీకు ఫోను చేశాడు కూడాను. ఆయన్నే ఎరగనంటారేం? "

అన్నాడు అప్పారావు సందేహంగా ఆయన వంక చూస్తూ.

షాక్ తిన్నవాడిల్లా ఉలిక్కిపడి, కాలింగ్‌బెల్ నొక్కబోతున్న వాడల్లా అమాంతం కుర్చీలో కూలబడ్డాడాయన!

"ఆయనా మీ మామయ్య!" కంపిస్తున్న స్వరంతో ఆయనన్న ఆ మాట అప్పారావు చెవి దాకా వెళ్ళలేదు.

క్షణమాగి టేబుల్ మీదున్న డైరీలో తానంతకుముందు వ్రాసుకున్న నోట్ చదువుకుని తలెత్తి అప్పారావు వంక చూశాడాయన!

అసలే తెల్లగా ఉన్న ఆయన మొహం ఆ క్షణంలో మరింత తెల్లబడటానికి హేతువేమిటో తోచలేదు అప్పారావుకు.

కాలింగ్‌బెల్ మ్రోగించాడాయన.

ఉలిక్కిపడ్డాడు అప్పారావు.

బంట్రోతు వెంట మరో గదిలోకి వెళ్ళిన అప్పారావు అరగంట తర్వాత ఆర్డరు కాగితం మడిచి జేబులో పెట్టుకుంటూ ఉత్సాహంగా వరండాలోకి వచ్చేడు.

వరండాలోకి వచ్చిన అప్పారావుకు అంతకు ముందక్కడ కూర్చున్న వాళ్ళలో పన్నెండు గురే అగుపించేరు.

పదమూడోవాడు తానంతకుముందు కూర్చున్న కుర్చీలో ఆ ఆఫీసరు కభిముఖంగా కంఠ శోష పడుతూ కూర్చునున్న సంగతి తెలీదు అప్పారావుకు.

*(1960)*

☆